క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.2,78,702



హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవదాయశాఖ ఈఓ, గ్రామ పెద్దలు

చీపురుపల్లి: మెట్టపల్లిలోని గొల్లపేరంటాల అమ్మవారి ఆలయంలో హుండీల ద్వారా రూ.2,78,702 ఆదాయం లభించినట్లు దేవదాయశాఖ కార్యనిర్వాహక అధికారి బి.శ్రీనివాస్ చెప్పారు. అమ్మవారి ఆలయం వద్ద సోమవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. ఈనెల 13 నుంచి 16 వరకు మూడు రోజులు అమ్మవారి జాతర మహోత్సవాలు జరిగాయి. భక్తుల నుంచి కానుకలు రూపంలో వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బూటు శ్రీను, వెంపడాపు రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో తాగునీటి బోర్లు



సోంపురంలో బోరు డ్రిల్లింగ్ పనులను పరిశీలిస్తున్న ఏఈ దేవి

వేపాడ: జిల్లా పరిషత్ నిధులతో మండలంలో నిధులతో అయిదు తాగునీటి బోర్లు ఏర్పాటు చేయనున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి తెలిపారు. జిల్లా పరిషత్ నిధులతో సోంపురంలో బోరు ఏర్పాటుకు సోమవారం డ్రిల్లింగ్ పనులు చేయించారు. జెడ్పీటీసీ శానాపతి అప్పారావు చొరవతో సోంపురం, చామలాపల్లి, ఓబలయ్యపాలెం నల్లబిల్లి, సింగరాయి గ్రామాలకు బోర్లు మంజూరయ్యాయి. ఒక్కో బోరుకు రూ.లక్ష చొప్పున నిధులు మంజూరయ్యాయని జెడ్పీటీసీ తెలిపారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు పోటీలు



పరుగు తీస్తున్న ఎడ్లు

వేపాడ: వీలుపర్తి పంచాయతీ పరిధిలోని చినదుంగాడ, పెదదుంగాడ గ్రామాల ఇలవేల్పు త్రిపురాంబ అమ్మవారి తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో 10 ఎడ్ల బళ్లు పాల్గొనగా, మొదటి మూడుస్థానాల్లో నిలిచిన ఎడ్లకు సంబంధించిన యజమానులకు నిర్వాహకులు, గ్రామపెద్దలు నగదు బహుమతులు అందజేశారు. భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

మూల్యాంకన ప్రక్రియను విజయవంతం చేయండి

- జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఎం.ఆదినారాయణ



మూల్యాంకనం కేంద్రంలో మాట్లాడుతున్న ఆర్ఐఓ ఆదినారాయణ

గజపతినగరం: గజపతినగరంలోని సాయిసిద్ధార్థ డిగ్రీ కళాశాలలో నిర్వహించే వృత్తి విద్యా కోర్సు జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియను విజయవంతం చేయాలని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఎం.ఆదినారాయణ కోరారు. స్పాట్ కేంద్రంలో అధ్యాపకులతో సోమవారం మాట్లాడారు. జవాబు పత్రాల మూల్యాంకనంలో పాటించాల్సిన నిబంధనలు, జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఓ వినోద్, కె.రమణ, వి.విజయలక్ష్మి, ఏసీఓలు వి.అప్పారావు, వై.శ్రీనివాసరావు, స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జి కాళ్ల గోవిందరావు, కాంట్రాక్ట్ లెక్చరర్ల రాష్ట్ర మీడియా ప్రతినిధి దుగ్గివలస రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పైడితల్లమ్మ పండగ

బొండపల్లి: రుద్రపాలెం గ్రామంలో పైడితల్లి అమ్మవారి పండగను మంగళవారం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత నిర్వహించే పండగకు గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం తొలేళ్ల ఉత్సవం, బుధవారం అనుపోత్సవం జరపనున్నారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్రజాశాంతికి భంగం కలిగిస్తే చర్యలు

విజయనగరం క్రైమ్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. ఈ మేరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై సోమవారం దాడులు చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు నగర శివారు ప్రాంతాలు, లే అవుట్లలో పోలీసులు దాడులు చేపట్టి 283 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ మేరకు మందుబాబులకు స్థానిక వన్‌టౌన్‌లో సీఐ శ్రీనివాస్ కౌన్సెలింగ్ నిర్వహించారు.

శివారు భూములకు సాగునీరందేనా..?

- వెదుళ్లవాని చెరువు పరిధిలో కాలువ నిర్మాణానికి కలగని మోక్షం
- మధ్యలో నిలిచిపోయిన సిమెంట్ కాలువ నిర్మాణం
- 1,200 మీటర్ల కాలువ నిర్మించాల్సి ఉండగా 500 మీటర్లే నిర్మించిన వైనం
- ఖరీఫ్ సీజన్‌లో చెరువులో పూర్తిస్థాయిలో నీరు ఉంటున్నప్పటికీ శివారు పొలాలకు అందని సాగునీరు
- కాలువ మిగులు పనులు పూర్తి చేయాలని కోరుతున్న రైతులు



సిమెంట్ కాలువ నిర్మించాల్సింది ఇక్కడి నుంచే...



నీరందక సాగుకు నోచుకోని శివారు భూములు

చీపురుపల్లి రూరల్(గరివిడి): సాగునీరు అందుబాటులో లేకపోవడం వల్లనో లేక వర్షాభావం వల్లనో పంటల సాగుకు రైతులు ఇబ్బంది పడుతుంటారు. కానీ గరివిడి మండలంలోని చుక్కవలస రెవెన్యూ పరిధిలోని వెదుళ్లవాని చెరువు ఆయకట్టు రైతులది విచిత్ర పరిస్థితి.ఖరీఫ్ సమయంలో చెరువులో పూర్తిస్థాయిలో నీరు ఉంటున్నప్పటికీ ఆయకట్టు రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఆయకట్టులో శివారు పొలాలకు సాగునీరందక ఏటా ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్లు వేసేందుకు ఇబ్బందులుపడుతున్నారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో వెదుళ్లవాని చెరువు పూర్తిస్థాయిలో నీటితో నిండు తున్నప్పటికీ తమ పల్లపు భూములు సాగుకునోచుకోవడం లేదని చుక్కవలస రైతులతో పాటు ఆ చెరువు ఆయకట్టులో ఉన్న చీపురుపల్లి మండలానికి చెందిన రామలింగాపురం,పుర్రేయవలస రైతులు వాపోతున్నారు.

50ఎకరాలకు అందని సాగునీరు

వెదుళ్లవాని చెరువు ఆయకట్టులో సుమారు 110 ఎకరాల పల్లపు భూమి ఉంది. ఇందులో చుక్కవలస రెవెన్యూ పరిధిలో 60ఎకరాలు, చీపురుపల్లి మండలంలోని రామలింగాపురం,పుర్రేయవలస గ్రామాల రెవెన్యూ పరిధిలో సుమారు 50ఎకరాలు ఉంది. సాధారణంగా ఎక్కడైనా చెరువు ఆయకట్టు పరిధిలో శివారు భూములు పల్లంగా ఉండడం సహజం. కానీ ఈ చెరువు ఆయకట్టులో శివారును ఉన్న 50 ఎకరాలు ఎత్తు ప్రాంతంలో ఉన్నాయి. ఈభూములకు సాగునీరు అందాలంటే చెరువు మదుము నుంచి 1200 మీటర్ల పొడవున నీరు ప్రవహించేలా శాశ్వతంగా సిమెంట్ కాలువ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, కానీ గతంలో 500 మీటర్ల వరకే కాలువ నిర్మించి మధ్యలో వదిలేశారని రైతులు చెబుతున్నారు. కాలువ మిగతా భాగాన్ని పూర్తి చేయకపోవడంతో శివారు భూములకు సాగు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని, ఈ పనుల్లోనే కాలువ నిర్మాణం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరందడం లేదు

ప్రతీ ఏడాది వర్షాకాలంలో వరదనీటితో చెరువు నిండుతుంది. చెరువులో నీరున్నప్పటికీ మా భూములకు అందడం లేదు.మాభూములు మెరక ప్రాంతంలో ఉన్నాయి. చెరువు మదుము నుంచి కొంత వరకే కాలువ ఉండడం వల్ల సాగునీరు శివారు భూములకు పారడం లేదు. కాలువ నిర్మాణం పూర్తి చేస్తే శివారు భూములకు కూడా నీరు అందుతుంది.

– జి.లచ్చుం, రైతు, చుక్కవలస

కాలువతోనే శాశ్వత పరిష్కారం

చెరువు కింద సిమెంట్ కాలువ నిర్మాణం పూర్తి చేస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కాలువ నిర్మాణం పూర్తి చేయించాలని కలెక్టర్‌కు గతంలో వినతిపత్రాలు అందజేశాం. అప్పట్లో అధికారులు వచ్చి మధ్యలో నిలిచిపోయిన కాలువ పనులను చూసి వెళ్లారు. ఆ తర్వాత అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువ నిర్మాణం పూర్తి చేయాలి.

– ఇప్పిలి నీలకంఠం,రైతు, రామలింగాపురం

‘ఉపాధి’ పనుల్లో ప్రభుత్వ తీరు సరికాదు

- అధికారులు స్పందించకుంటే ధర్నాకైనా సిద్ధం
- విలేకరుల సమావేశంలో ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు



మండల పరిషత్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ఎంపీపీ సోమేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు

శృంగవరపుకోట: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల్లో అధికారులకు, ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని, దీనివల్ల అభివృద్ధి కుంటుపడుతోందని ఎంపీపీ సొండి సోమేశ్వరరావు సహా పలువురు ఎంపీటీసీ సభ్యులు మండిపడ్డారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సోమేశ్వరరావు నేతృ త్వంలో ఎంపీటీసీ సభ్యులు సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గతేడాది ఆగస్టులో గ్రామసభల ద్వారా 744 పనులకు ప్రతిపాదనలు వచ్చాయని, తొలుత 163 పనులకు రూ.12.78లక్షలతో తీర్మానాలు చేసి పంపగా కొన్ని పనులే మంజూరయ్యాయన్నారు. రెండో విడత పంపిన 73 పనులకు ఎలక్షన్ కోడ్ ఉందని, పనులు చేయవద్దన్నారని, ఇప్పుడు భువన యాప్‌లో పనులు నమోదు కాలేదని, వాటిని చేయవద్దని అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఈనెలలో 3వ విడత మరో 166 పనులకు ప్రతిపాదనలు పంపించగా అవి కూడా యాప్‌లో నమోదు కాలేదని చెబుతూనే ఇప్పుడు 4వ తీర్మానం కావాలని అధికారులు అడుగుతుండడం సరికాదన్నారు. గత మూడు దఫాల్లో ఇచ్చిన పనులు ఎందుకు భువన యాప్‌లో నమోదు కాలేదని అడిగితే అధికారులు సరైన సమాధానం ఇవ్వ డం లేదని మండిపడ్డారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించే ఉద్దేశం అధికారుల ఉందో లేదో తెలియడం లేదని ధ్వజమెత్తారు. జిల్లా అధికారులు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జోక్యం చేసుకుని గత మూడు విడతలుగా ప్రతిపాదించిన పనులకు అనుమతులు ఇవ్వకుంటే మండల పరిషత్ కార్యాల యం వద్ద ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీటీసీ లు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, బి.ఆదిలక్ష్మి, మోపాడ గౌరీశ్వరి, బోదల దేముడు, ఆర్.ధారగిరి, బషీర్, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఏం తప్పు చేశాడని ఫీల్డు అసిస్టెంట్‌ను తొలగించారు..?



అధికారులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, వేతనదారులు

చీపురుపల్లి: ఏం తప్పు చేశాడని తమ గ్రామ ఫీల్డు అసిస్టెంట్‌ను తొలగించారని పుర్రేయవలస గ్రామ ఉపాధిహామీ వేతనదారులు, ఆ గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. గ్రామస్తులు, వేతనదారులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతంతో కలిసి ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ చాంబర్‌లో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఐ.సురేష్, ఉపాధిహామీ పథకం ఏపీఓ ఆదిబాబును ప్రశ్నించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వేతనదారులందరికీ సక్రమంగా పనులు కల్పించడమే ఫీల్డ్ అసిస్టెంట్ చేసిన తప్పా అని నిలదీశారు. ఫీల్డు అసిస్టెంట్ అవినీ తికి పాల్పడితే విచారణ జరిపించి అధికారికంగా తొలగించాలన్నారు. ఎలాంటి విచారణలు లేకుండా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి తొలగించడం అన్యాయమన్నారు. ఫీల్డు అసిస్టెంట్ లేకపోవడంతో పాటు రెండు నెలలుగా ఉపాధి పనులు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. పనులు లేక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభించాలని కోరారు. గ్రామంలో రామమందిరం వద్ద గ్రామసభ నిర్వహించి ఫీల్డు అసిస్టెంట్ తొలగింపు విషయమై చర్చించాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా గ్రామంలో 500 మందికిపైగా వేతనదారులను ఇబ్బందులకు గురి చేయొద్దని కోరారు. జమ్ము అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై శ్రద్ధ వహించాలి

- ఆర్డీఓ సత్యవాణి



రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యవాణి

చీపురుపల్లి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడంలో రాజకీయ పార్టీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్డీఓ జి.వి.సత్యవాణి చెప్పారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి నెలా అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి ఓటరు నమోదు, చేర్పులు, మార్పులపై చర్చించుకోవాల్సి ఉంటుందన్నారు. ఓటరు జాబితాల్లో అనర్హులను తొలగిస్తూనే, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీల నుంచి కోరుకొండ దాలయ్య, గవిడి నాగరాజు, కోట్ల కృష్ణ, ఆర్డీఓ కార్యాలయం ఏఓ ఆర్.ఈశ్వరమ్మ, ఎన్నికల తహసీల్దార్ ఎం.హర్షవర్ధిని, తదితరులు పాల్గొన్నారు.

నేడు నేత్ర వైద్యశిబిరం

దత్తిరాజేరు: కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి స్రవంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సిబ్బంది నేత్రపరీక్షలు చేసి, శస్త్ర చికిత్సలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కూలిన కల్వర్ట్.. లారీ బోల్తా



కల్వర్ట్ కూలి పోవడంతో కాలువలో బోల్తా పడిన లారీ

వేపాడ: మండలంలోని బల్లంకి నుంచి ఆనందపురం వెళ్లే రహదారిలో రైవాడ కాలువపై నిర్మించిన తాత్కాలిక కల్వర్ట్ సోమవారం రాత్రి కూలిపోవడంతో ఓ లారీ బోల్తాపడింది.స్థానికులు తెలిపిన వివరాలు.. వావిలపాడు నుంచి విశాఖపట్నానికి మెటల్ లోడ్‌తో అయిదు లారీలు ఒకేసారి బయలు దేరి రైవాడ కాలువపై తాత్కాలిక (తాటిదుంగలతో వేసిన) కల్వర్ట్ వద్దకు చేరుకున్నాయి. వీటిలో ఒక లారీ కల్వర్ట్ దాటి వెళ్లిపోయింది. రెండోలారీ కల్వర్ట్‌పైకి ఎక్కగానే కల్వర్ట్ కూలిపోయింది. దీంతో లారీ కాలువలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కల్వర్ట్ కూలిపోవడంతో ఆమార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. కాలువలో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగింది. రైవాడ కాలువపై జీవీఎంసీ కొన్నేళ్ల క్రితం నిర్మించిన కల్వర్ట్ ఈ ఏడాది జనవరిలో కూలి పోవడంతో స్థానిక పెద్దలు తాడిదుంగలతో కల్వర్ట్ ఏర్పాటు చేశారు. తాజాగా అది కూడా కూలిపోయింది. జీవీఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి శాశ్వత కల్వర్ట్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

బొండపల్లి: మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆభూములను స్వాధీనం చేసుకో వాలని జైభీమ్ అంబేడ్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు బగ్గా ఎర్రయ్య కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో జాతీయ రహదారి–26ను ఆనుకుని ఉన్న శెలగశెట్టి కోనేరు గట్టు, కోనేరు గర్భాన్ని కొంతమంది వ్యక్తులు చదును చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఎం.ఛానల్ నుంచి శెలగశెట్టి కోనేరుకు వెళ్లే సాగు నీటి కాలువను కొందరు పూర్తిగా కప్పేసి కంచె వేసేశారని వివరించారు. బోడసింగిపేట గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 32లో ప్రభుత్వ బందను కొంత మంది వ్యక్తులు కబ్జా చేసి ఇటీవల చదును చేశారని, మండల సర్వేయర్ చక్రపాణికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడుకు సమస్యలను వివరిస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడును ఎంటీఎస్ ఉపాధ్యాయులు కోరారు. ఎమ్మెల్సీని విజయనగరంలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని ఎంటీఎస్ ఉపాధ్యాయులు, పీఆర్టీయూ నాయకులు సోమవారం కలిశారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల యూనియన్ నేత ఎల్.వెంకటరావు మాట్లాడుతూ ఎంటీఎస్ 98, 2008 ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, హెల్త్‌కార్డులు జారీ చేయాలని, సర్వీస్ రెగ్యులరైజ్ చేసేలా ప్రభుత్వానికి సూచించాలని కోరారు. చివరి దశలో ఉద్యోగాలు పొందిన తమకు కనీసం నాలుగేళ్ల సర్వీసు లేకుండా పదవీ విరమణ చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు స్పందించి ఎంటీఎస్‌ల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు టి.రామారావు, ఎం.అప్పలరాజు, పీఆర్టీయూ నాయకులు సురేష్, బంగారునాయుడు, గొల్లు సూరిబాబు, టి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలు ప్రారంభం



శృంగవరపుకోట: ఎస్.కోట బాలికోన్నత పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల కోలాహలం



వేపాడ: వేపాడఉన్నత పాఠశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



దత్తిరాజేరు : పరీక్ష కేంద్రానికి వెళుతున్న కేజీబీవీ విద్యార్థినులు



గజపతినగరం: బాలుర హైస్కూల్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

శృంగవరపుకోట: పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారుల్లో, స్కూళ్ల వద్ద సందడి నెలకొంది. తొలిరోజు కావడంతో తమ పిల్లలను తీసుకుని గుడులు గోపురాలకు వెళ్లే తల్లిదండ్రులు, ఎగ్జామ్ సెంటర్లకు పిల్లలను చేర్చి జాగ్రత్తలు చెప్పే తల్లిదండ్రులు, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు.. ఇలా పరీక్ష సెంటర్ల వద్ద ఎక్కడా చూసినా ఒకటే కోలాహలం. ఉదయం 8.30 గంటల నుంచి రోడ్లపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఉరుకులు, పరుగులతో దర్శనమిచ్చారు. స్థానిక కేంబ్రిడ్జ్ స్కూల్‌కి 198 మంది విద్యార్థులను కేటాయించగా 195 మంది, సర్వేపల్లి స్కూల్‌లో 132 మందికి 131 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 163 మందికి 162 మంది, జెడ్పీ బాలికోన్నత పాఠశా లలో 206 మందికి 200 మంది హాజరయ్యారని ఎంఈఓ నర్సింగరావు చెప్పారు. తొలిరోజు తెలుగు పరీక్ష అంతటా ప్రశాంతంగా పూర్తయ్యింది.

- **చీపురుపల్లిరూరల్(గరివిడి)** :గరివిడి పట్టణంలోని కొండపాలెం, గరివిడి, కోనూరు ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాల్లో 618 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 616 మంది హాజరయ్యారు.
- **గుర్ల:** మండలంలో పదోతరగతి తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గుర్ల, కలవచర్ల, తెట్టంగి ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలకు 446 మంది విద్యార్థులను కేటాయించగా 444 మంది హాజరయ్యారని ఎంఈఓ ఎస్.భానుప్రకాశరావు తెలిపారు.
- **బొండపల్లి:** మండలంలో మూడు కేంద్రాల్లో 536 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా తొలిరోజు పరీక్షకు 534 మంది హాజరయ్యారని ఎంఈఓ శోభారాణి తెలిపారు.
- **దత్తిరాజేరు:** మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో 456 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా తొలిరోజు పరీక్షకు 455 మంది హాజరయ్యారని ఎంఈఓ ఎం.వెంకటరావు తెలిపారు.
- **వేపాడ:** మండలంలో మూడు పరీక్ష కేంద్రాలకు 412 మంది విద్యార్థులను కేటాయించగా తొలిరోజు 411 మంది హాజరయ్యారని ఎంఈఓ బాలభాస్కరరావు తెలిపారు.
- **గజపతినగరం:** మండలంలో నాలుగు కేంద్రాలకు 690 మంది విద్యార్థులను కేటాయించగా తొలిరోజు పరీక్షకు 680మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ విమలమ్మ తెలిపారు.
- **చీపురుపల్లి:** మండంలోని మెట్టపల్లి ఉన్నత పాఠశాలతో పాటు పట్టణంలోని బాలుర, బాలికోన్నత పాఠశాలలు, బిఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 950 మంది విద్యార్థులకు తొలిరోజు పరీక్షకు 939 మంది హాజరయ్యారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



పీహెచ్‌సీలో రోగుల వార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి

చీపురుపల్లిరూరల్(గరివిడి): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ మీసాల విజయలక్ష్మి వైద్యాధికారుల కు సూచించారు. గరివిడి మండలంలోని కోనూరు పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటి సమావేశం సోమవారం నిర్వహించారు. పీహెచ్‌సీలో మందులు అందుబాటులో ఉన్నదీ లేనిది, ప్రజలకు అంది స్తున్న సేవలు, ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఆస్పత్రిలో సమావేశ భవనం,ల్యాబ్, మందుల నిల్వలకు ప్రత్యేక భవనాలు నిర్మించేలా చూడాలని వైద్యాధికారి రమణి ఎంపీపీ దృష్టికి తీసుకు వెళ్లారు. ఎంపీపీ స్పందిస్తూ జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగుల వార్డులను ఎంపీపీ పరిశీలించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు,ఎంపీహెచ్ఈఓ ఎన్.అప్పలనాయుడు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బూడి శ్రీరాములునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఈయూ గౌరవాధ్యక్షుడిగా అప్పలనాయుడు



అప్పలనాయుడును అభినందిస్తున్న ఈయూ నాయకులు

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా స్థానిక వ్యాపారవేత్త పి.అప్పలనాయుడును ఎంపిక చేసినట్టు సంఘ నాయకులు ప్రకటించారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి, జోనల్ సెక్రటరీ బి.కె.మూర్తి నేతృత్వం లో సోమవారం ఆర్టీసీ డిపోలో సర్వసభ్యసమావేశం నిర్వహించారు. సమావేశంలో అప్పలనాయుడును సంఘ గౌరవాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ప్రకటించారు. అనంతరం డిపోలో ఉన్న సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. మంగళవారం ఆర్టీసీ ఈడీతో జరగనున్న చర్చల్లో డిపో పరిధిలోని సమస్యలను ప్రస్తావిస్తామని చెప్పారు. ఆర్టీసీ ఈయూ జిల్లా ప్రెసిడెంట్ కె.కె.రావు, జిల్లా సెక్రటరీ జి.రవికాంత్, జిల్లా కోశాధికారి సీహెచ్.ప్రభ, డిపో అధ్యక్షుడు కె.జి.నాయుడు, కార్యదర్శి కె.కోటేశ్వరరావు, గ్యారేజ్ సెక్రటరీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కష్టార్జితం కాలిపోయింది..

- రాయుడుపేటలో అగ్ని ప్రమాదం
- రూ. లక్ష నగదుతో పాటు సారె సామాన్లు అగ్నికి ఆహుతి



కాలిపోయిన ఇంటిముందు బాధిత కుటుంబ సభ్యులు

వేపాడ: మండలంలోని రాయుడుపేటలో ఆదివారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో బెహరా పరదేశికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఇటీవల పరదేశి చిన్న కుమారైకు వివాహం జరగడంతో అత్తవారింటికి ఇవ్వాల్సిన సారె సామాన్లు డబల్ కాట్ బెడ్, ఫ్యాన్‌లు, గ్రైండర్, డ్రెస్సింగ్ టేబుల్, తదితర సామాగ్రి ఇంటిలో ఉంచారు. అలాగే పరదేశి మనుమరాలు (కుమారుడి కూతురు) రజస్వల ఫంక్షన్ కోసం సిద్ధం చేసిన లక్ష రూపాయల నగదు కూడా ఇంటిలో ఉంచారు. అయితే అగ్ని ప్రమాదంలో నగదుతో పాటు సారె సామగ్రి కాలి బూడిదవ్వడంతో పరదేశి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ రాములమ్మ, వీఆర్ఓ శ్రీనివాసరావు, తదితరులు గ్రామానికి చేరుకుని నష్టాన్ని అంచనా వేశారు. సుమారు రూ. ఐదు లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు.

